

విధానసౌధలో వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం


ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు
మహర్షి వాల్మీకి పేరు


- రామరాజ్యం అంటే సమానత్వం
- కాంగ్రెస్ హయాంలోనే ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్
- వాల్మీకి జయంతి సభలో సీఎం సిద్దరామయ్య

రాయచూరు విశ్వవిద్యాలయంతోపాటు రాష్ట్రంలోని అన్ని షెడ్యూల్ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మహర్షి వాల్మీకి పేరు పెడతామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. అడవుల్లో జీవిస్తున్న వాల్మీకి సంస్కృతాన్ని నేర్చుకుని కావ్యాన్ని రచించారనీ, ఆ మహనీయుడిని స్మరించుకోవడం అందరి భాగ్యమన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన మహర్షికి పుష్పాంజలి ఘటించారు.

7

రాజసం..!





- రాజభాషకు అపూర్వ గౌరవం
- ప్రారంభానికి సిద్ధమైన సంస్కృత విశ్వవిద్యాలయం
- 12 ఏళ్ల కల సాకారం
- రాష్ట్రంలో మొదటిది.. దేశంలో 16వ యూనివర్సిటీ
- పెజావర, శివకుమార స్వామీజీల పేరిట పీఠాలు
- 31కాలేజీలు, 35 శాఖలు.. 490 పాఠశాలలు..



- ప్రారంభానికి సిద్ధమైన సంస్కృత యూనివర్సిటీ

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజభాషకు అపూర్వ గౌరవం దక్కనుంది. రాష్ట్రంలో ఏకైక సంస్కృత విశ్వవిద్యాలయం రామనగర జిల్లా తిప్పసంద్ర పరిధిలోని మరడిగుట్టె అటవీప్రాంతంలో దాదాపు నిర్మాణం పూర్తయ్యింది. త్వరలోనే ప్రారంభానికి సన్నద్ధమైంది. విశ్వవిద్యాలయ స్థాపనకు 2012లో బెంగళూరు - మంగళూరు జాతీయ రహదారి 75పై మరడిగుట్ట వద్ద వంద ఎకరాల స్థలం కేటాయించారు. పాలనాపరంగా జాప్యం, గ్రాంట్లు విడుదల చేయకపోవడం వంటి అనేక కష్టమైన సమస్యలను అధిగమించి 12ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో సిద్ధమైంది. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్న సమయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించిన అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి అశ్వత్థనారాయణ చొరవతో 2022లో యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. రూ.30కోట్లు ఖర్చు చేసి ఐదు ఎకరాల స్థలంలో పాలనా భవనం, హాస్టల్‌తోపాటు వివిధ విభాగాలను నిర్మించారు. అన్నిభాషలకు మూలం సంస్కృతంగా భావిస్తారు. అందుకే సంస్కృతాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలంటే ప్రత్యేక విద్యాసంస్థ ఉండాలని యూనివర్సిటీ ఉండడం ద్వారా భాషా ప్రాచుర్యం సాధ్యం కానుందని భావించి 2008లో అప్పటి సీఎం బీఎస్ యడియూరప్ప, హంపి యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ మల్లేపురం జి వెంకటేశ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. వీరు 2010లో మరడిగుట్ట వద్ద వంద ఎకరాల అటవీప్రదేశాన్ని ఎంపిక చేశారు.

జాప్యానికి ఎన్నో కారణాలు

విశ్వవిద్యాలయాన్ని కేటాయించిన భూమి అటవీప్రాంతంలో ఉండడంతో అనుమతులు పొందడం సవాల్‌గా మారింది. మరోవైపు ఉన్నత విద్యాశాఖ, రెవెన్యూశాఖలు జోక్యం చేసుకుని స్థలాన్ని సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. బెంగళూరు - మంగళూరు రైల్వే ట్రాక్ ఉండడంతో రైల్వేశాఖతోనూ చర్చలు జరపాల్సి వచ్చింది. అన్ని అనుమతులు పొందేందుకు దశాబ్దకాలం పట్టింది.



ఏయే శాఖలు ఉంటాయి..

సంస్కృత విశ్వవిద్యాలయంలో బోధనా అంశాల్లో వేదాంతం, భాషా శాస్త్రం, జ్యోతిష్యం, ఆగమశాస్త్రం, అద్వైత శాస్త్రం, ఆయుర్వేదం, యోగా విభాగాలు ఉంటాయి. వీటితోపాటు బోధనా విభా గం, పరిశోధనలు, ప్రచారం, ముద్రణ విభాగాలు ఉంటాయి. బాలగంగాధరనాథ, పెజావర, శివకుమార స్వామీజీల పేరిట అధ్యయన పీఠాలు ఏర్పాటు చేయనున్నారు. మఠాలు ఇందుకు ఆర్థిక పరమైన సహకారం అందించనున్నాయి. సంస్కృత యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తిప్పసంద్ర హోబళి పరిధిలో రవాణా, వాణిజ్యరంగాలు మరింత అభివృద్ధి చెందనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో సంస్కృత విశ్వ విద్యాలయాల్లో ఇది 16వది కానుంది. ఈ భవనంలో రాష్ట్రానికి చెందిన 31 సంస్కృత కళాశాలలు, 490 పాఠశాలలు, 35 బోధనా శాఖలు, 11 సంస్కృత అధ్యయన కేంద్రాలు, 126 విదేశీ సంస్కృత అధ్యయన కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. సంస్కృత విశ్వవిద్యాలయం పాలనా భవనాల నిర్మాణం ఇప్పటికే ముగిసింది. ప్రభుత్వంతో చర్చలు జరిపి చామరాజపేటలోని పాలన విభాగాన్ని మార్పు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ మంత్రి అశ్వత్థనారాయణ ఇదే విషయమై స్పందిస్తూ 12ఏళ్లుగా సాధ్యం కాని సంస్కృత విశ్వవిద్యాలయం ఎట్టకేలకు ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. సంస్కృత భాషకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. శివమొగ్గ జిల్లాలోని ఓ గ్రామంలో సంపూర్ణంగా సంస్కృతాన్ని మాట్లాడే సంప్రదాయం ఉందని ఆయన పేర్కొన్నారు.



విశేష పూజల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బోసరాజు తదితరులు

ఘనంగా తలకావేరి తీర్థోద్భవ

కోట్లాదిమంది కన్నడిగుల జీవనాడి కావేరి నది ఉద్భవించే స్థలంలో ఏటా సంప్రదాయబద్ధంగా జరిపే తలకావేరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం తుల సంక్రమణలో తీర్థోద్భవాన్ని తిలకించేందుకు పలు ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.

7

ఓట్లు.. కోట్లు..!

- రూ.7 కోట్లు పంపుతున్నాను..
- ఓటుకు రూ.500 ఇవ్వండి..
- సీఎం, డీసీఎం సూచించారు..
- మనకు ఓటేసే వారందరికీ చేరాలి..
- లోక్‌సభ ఎన్నికల నాటి ఆడియో వైరల్
- అరసికెరె ఎమ్మెల్యే శివలింగే గౌడ మాటలుగా అనుమానం



బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ హాసన్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల పంపిణీకి సంబంధించి అరసికెరె ఎమ్మెల్యే శివలింగేగౌడ మాట్లాడినట్లుగా ఉండే ఆడియో బుధవారం వైరల్ అయ్యింది. ఎన్నికలు జరిగిన నాలుగు నెలల తర్వాత ఆడియో వైరల్ కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే శివలింగేగౌడ మాట్లాడినట్లుగా ఉండే ఆడియోలో సీఎం, డీసీఎంల సూచనకు అనుగుణంగా డబ్బులు పంచాలని మొత్తం 7 కోట్ల రూపాయలు పంపిణీకి సంబంధించి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయస్ పాటిల్ రూ.5కోట్లు ఇస్తారని, మాజీ ఎమ్మెల్సీ గోపాలస్వామి కోటి రూపాయలు ఇస్తారని, తాను కోటి రూపాయలు ఇస్తానని, మొత్తం ఏడు కోట్ల రూపాయలు పంపిణీ చేయాలని ఆడియోలో స్పష్టంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యే శివలింగేగౌడ పార్టీకి చెందిన ముఖ్యులతో మాట్లాడినట్లుగా ఉంది. ప్రతి ఓటుకు రూ.500 ఇవ్వాలని, 68-70 శాతం మందికి డబ్బులు ఇవ్వాలని, ఎవరు ఓట్లు వేస్తారో వారిని గుర్తించి పంపిణీ చేయాలని సూచించారు. సీఎం, డీసీఎం, ఇన్‌చార్జ్ మంత్రులు తీర్మానం చేశారని అందుకు అనుగుణంగానే పంచాలన్నారు. శివరాం ఇంటికి వెయ్యి రూపాయలు ఇస్తున్నారని, మనం ఓటుకు రూ.500 ఇవ్వాలని అందులో ఉంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శివరాం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన అంశంకూడా ఆడియోలో ఉంది. తీర్మానించింది 500 మాత్రమేనని, అదే తరహాలోనే పంచాలనే మాటలు ఆడియోలో ఉన్నాయి. హాసన్‌లో సంచలనం కలిగించిన అప్పటి ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోకు సంబంధించి కూడా మాట్లాడారు. ఇటువంటి సంఘటనలను ఎన్నికల వేళ సద్వియోగం చేసుకోవాలని, వీడియో లీక్ అయిన తర్వాత కుమారస్వామి ప్రచారానికి రాలేదని, దేవెగౌడ ఈ వయస్సులో ప్రచారం చేయాలా... ఎవరూ లేరా..? అంటూనే బీజేపీ నాయకులు పనిచేయడం లేదని కూడా అన్నారు. బేళూరు ఎమ్మెల్యే సురేశ్ సరిగా పనిచేయడం లేదని, శివరామ్ వచ్చిన తర్వాత రౌడీలు గురుకుంటున్నారని గతంలో రుద్రేశ్‌గౌడ ఉన్నప్పుడు ఇలాంటి వారందరినీ దూరం పెట్టారని, శివలింగేగౌడ మాట్లాడినట్లు ఆడియోలో ఉంది. ఈ అంశం హాసన్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది.

ప్రమాదంలో..
పల్లెలు

- తక్షణమే ఐదు గ్రామాల ప్రజలను తరలించండి
- చిక్కమగళూరు అధికారులకు జీఎస్ఐ సూచన



బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆ ఐదు గ్రామాలు ప్రమాదంలో ఉన్నాయి..తక్షణమే అక్కడి ప్రజలను తరలించాలని జీఎస్ఐ సూచించింది. చిక్కమగళూరు జిల్లా పరిధిలోని ఐదు గ్రామాలు భౌగోళికంగా ప్రమాదంలో ఉన్నాయని వాటిని ఇతర ప్రాంతాలకు తరలించాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులను (జిఎస్ఐ) సూచించింది. గ్రామాల్లో భూమి కుంగిపోతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయని తద్వారా పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. జియోలాజికల్ సర్వే బృందం చిక్కమగళూరు జిల్లా అధికారికి సమగ్ర నివేదికను, సిఫారసులను సమర్పించింది. కొప్ప తాలూకాలోని గుడ్డతోట, బసిరికట్టె, శృంగేరి తాలూకాలోని కరదండె, కళశ తాలూకా పరిధిలోని సోమనకట్టె, చన్నహడ్లు గ్రామాల్లో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని నివేదికలో స్పష్టం చేశారు. 2019లో భారీ వర్షాలతో ఈ ఐదు గ్రామాల్లోనూ భూమి కుంగిపోయింది. ఇటీవల మూడు నెలలుగా పశ్చిమకనుమల్లో నిరంతరంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవి మరింత తీవ్రమైతే సంబంధిత గ్రామాల్లో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని నివేదికలో పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నివేదిక ప్రకారం చర్యలు తీసుకునేందుకు చిక్కమగళూరు జిల్లా అధికారి మీనా నాగరాజ్ సిద్ధమయ్యారు. త్వరితగతిన చర్యలు చేపట్టి గ్రామప్రజలను ఇతర ప్రదేశాలకు తరలించాలని తాలూకా స్థాయి తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులు, పాలనా యంత్రాంగానికి సూచించారు. ఐదు గ్రామాల ప్రజలకు పునరావాసం, ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించే అంశంపై చర్చలు జరుపుతున్నారు. అధికారుల సలహాలు, నిర్ణయాలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టనున్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికను ప్రభుత్వానికి పంపి చర్చలు జరపదలిచామని ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు చేపడతామని జిల్లా అధికారి మీనా నాగరాజ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడిన బాలుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- అధికారులపై స్థానికుల ఆగ్రహం



నివేదన్ (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాలువలో పడ్డ బాలుడు మృత్యువాత పడ్డాడు. హావేరిలో 12ఏళ్ల నివేదన్ ప్రమాదవశాత్తు వర్షపు కాలువలో పడి బలయ్యాడు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయం ముందు కాలువ గుర్తించకపోవడంతో అకస్మాత్తుగా కాలువలో పడిపోయాడు. వెంటనే స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై ప్రవాహంలో కొట్టుకుపోతుండగా గుర్తించి రక్షించారు. అప్పటికే అధికంగా నీరు తాగడంతోపాటు శ్వాస ఆడక ఇబ్బంది పడుతున్న బాలుడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక కన్నుమూశాడు. పీబీ రోడ్డులోని శివాజీనగర్ మూడో క్రాస్‌లో కాలువలో నివేదన్ బసవరాజ్ కొట్టుకుపోయాడు. స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపడుతూనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఓ మెడికల్ షాప్ ముందుభాగంలో స్లాబ్ సమీపంలో బాలుడిని గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది రక్షించి బయటకు తీశారు. శ్వాస ఆడుతుండడంతో వెంటనే బాలుడిని కృత్రిమంగా ఆక్సిజన్ అందించి ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు ఫలించక బాలుడి మృతి చెందడంతో హావేరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా అధికారి విజయ మహంతేశ్, అడిషినల్ ఎస్పీ శిరకోళలు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాలుడి మృతిపై కుటుంబ సభ్యులు, స్థానికులు శివాజీనగర్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. కాలువల ఆక్రమణలు, పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని అధికారులపై మండిపడ్డారు.

కనికరం లేని కరెంటోళ్లు..!

- జెస్కాం అధికారుల నిర్లక్ష్యం
- విద్యుత్ ప్రమాదాల్లో 141 మంది మృత్యువాత
- పరిహారం 64 మందికే...
- ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం
- కార్యాలయాల చుట్టూ మృతుల కుటుంబీకుల ప్రదక్షిణ



బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద ఆకస్మికంగా మృత్యువాత పడితే ఆ కుటుంబ వీధిన పడకమానదు..ఏదైనా ప్రమాదంలో వైకల్యం చెందితే జీవనోపాధి కోల్పోక తప్పదు. అలాంటి వారిని చూస్తే ఎవ్వరికైనా జాలి కలగక మానదు. కానీ జెస్కాం అధికారులు మాత్రం అలాంటి వారిపై కనీసక జాలి చూపడం లేద. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి పరిహారం అందించడంలో జెస్కాం నిర్లక్ష్యం వహిస్తోంది. గుల్బర్గా విద్యుత్ సరఫరా కంపెనీ(జెస్కాం)పరిధిలో గత 17నెలల్లో వేర్వేరు విద్యుత్ ప్రమాదాల్లో 141మంది ప్రాణాలు పోగొట్టుకోగా... 85మంది వరకు గాయపడ్డారు. వీరిలో కేవలం 64మందికి మాత్రమే పరిహారం అందింది. బాధిత కుటుంబాలు జెస్కాం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మృతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో జెస్కాం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో బాధిత కుటుంబాలకు ఆవేదన తప్పడం లేదు. గుల్బర్గా విద్యుత్ సరఫరా కంపెనీ పరిధిలోకి బళ్ళారి, బీదర్, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాలతో పాటు యాదగిరి జిల్లాలున్నాయి. ప్రజలు, పశువులు తదితర వాటిని కలుపుకుని ఆగస్టు చివరి నాటికి 688 విద్యుత్ ప్రమాదాలు జరిగినట్లు జెస్కాం రికార్డుల్లో నమోదు అయ్యాయి. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ముగ్గురు సిబ్బందితో కలుపుకుని మొత్తం 93మంది విద్యుత్ సంబంధిత ప్రమాదాల్లో మృతి చెందారు. వీరిలో జెస్కాం శాఖకు చెందిన 37మందితో పాటు 59మంది గాయపడ్డారు. అదే ఏడాది 142 మూగజీవాలు బలి కావడం గమనార్హం. ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరం ఆగస్టు నెల వరకు జెస్కాం శాఖలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది, 46మంది పౌరులతో చేరి మొత్తం 48 మంది మృతి చెందగా, మొత్తం 26మంది గాయపడ్డారు. వీరితో పాటు 50 మూగప్రాణులు కూడా గాయపడ్డాయి. ఇంత భారీ ప్రమాణంలో చావులు, క్షతగాత్రులకు పోలిస్తే మృతుల కుటుంబాలకు లభించిన పరిహారం కేసులు సగానికి కూడా తక్కువే ఉండడం శోచనీయం. గత ఆర్థిక సంవత్సరంలో 152 కేసులు(చావులు, గాయపడి) 47మందికి రూ 2.11కోట్ల రూపాయలు పరిహారం లభించినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల్లో 74 కేసుల్లో 17 మంది మృతుల కుటుంబాలకు కేవలం రూ 49.85లక్షలు పరిహారం మొత్తం లభించింది. సంబంధిత ప్రాధికారక ధ్రువీకరణ పత్రాల జాప్యం, సరైన పత్రాలు సమర్పించకపోవడం, సాంకేతిక కారణాలతో బకాయిలు కేసులు చెల్లింపులో జాప్యం జరుగుతోందని జెస్కాం శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. పరిహారం పొందడానికి విధించిన షరతులు కూడా బాధిత కుటుంబాలకు శాపంగా మారాయి. విద్యుత్ ప్రమాదానికి కారణాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ప్రమాదంలో దివ్యాంగులుగా మారితే అలాంటి వారిని జిల్లా సర్జన్, అంతకు పై అధికారి నిర్ధారించాలి. పంట హాని, ఆస్తి హాని, గృహోపయోగ ఉపకరాణలతో పాటు ఇతర నష్టం జరిగితే జెస్కాం అధికారులు నిర్ధారించాలి. బాధితులకు పరిహారం అందాలంటే అడ్మినిస్ట్రేషన్ ఏరియా చీఫ్ ఇంజనీర్ లేదా సూపరింన్‌డెంట్ ఇంజనీరు పరిహారం మొత్తం అందించాల్సి ఉంటుంది. పరిహారం కోరేవారు లేఖ రూపంలో వినతి అందజేయాల్సి ఉంటుంది. జెస్కాం సిబ్బంది, పౌరులు మరణం, శాశ్వత వైకల్యం సంభవించినట్లు అయితే అలాంటి వారికి రూ 5లక్షలు పరిహారం చెల్లించబడుతుంది. పాక్షిక వైకల్యం సంభవిస్తే రూ.లక్ష నుంచి రూ 5లక్షల వరకు, గాయం, తాత్కాలిక వైలకల్యానికి రూ 20వేలు, పాక్షిక వైకల్యానికి కనీసం రూ 25వేలు, గరిష్ఠంగా రూ.50వేలు చెల్లించబడుతుందని జెస్కాం అధికారులు పేర్కొంటున్నారు. సరైన ధ్రువపత్రాలు లేకపోతే పరిహారం అందించడం కష్టమని అంటున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్

న్యూస్ బాక్స్

21న ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్ ఇస్తామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కిరణ్మయి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాల మేరకు పీజీ సెట్ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అన్నారు. 21న జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. పీజీ సెట్‌లో అర్హత సాధించి, ఇప్పటివరకు ఎక్కడా ప్రవేశాలు పొందని వారు స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులని తెలిపారు. అడ్మిషన్ అయిన వెంటనే కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే రిజర్వేషన్ కాలపరిమితి కుదింపు

ఇకపై రెండు నెలలకు ముందు మాత్రమే..

గుంతకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకునే గడువును రైల్వే శాఖ కుదించింది. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏఆర్‌పీ) నిబంధనలను అనుసరించి ప్రస్తుతం నాలుగు నెలల ముందే బెర్త్‌ను రిజర్వేషన్ చేసుకునే వీలుంది. ఆ కాలాన్ని రైల్వే శాఖ 60 రోజులకు కుదించింది. నవంబరు 1వ తేదీ నుంచి ఈ మార్పు అమలులోకి రానుంది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ టిక్కెట్టును రద్దు చేసుకోదలిస్తే, పాత నిబంధనలను అనుసరించి నవంబరు 1 లోపు కూడా రద్దు చేసుకునే వీలు కల్పించారు.

అక్రమాలు జరక్కుండా..

నాలుగు నెలల ముందు బెర్త్ టిక్కెట్టు రిజర్వు చేసుకునే పద్ధతి అక్రమాలకు అవకాశం ఇస్తోందని రైల్వే శాఖ తెలియజేసింది. అవసరం లేకపోయినా కొందరు టిక్కెట్లను రిజర్వేషన్ చేసి, బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని పేర్కొంది. నాలుగు నెలల ముందు రిజర్వు అయిన బెర్తులు ఎక్కువ సంఖ్యలో రద్దు అవుతున్నాయని, దాదాపు 21 శాతం టిక్కెట్లు క్యాన్సిల్ అవుతున్నాయని అధికారులు తెలిపారు. త్వరగా టిక్కెట్లు అమ్ముడవుతున్నందున బెర్త్ కన్ఫర్మ్ కాదన్న కారణంగా కొందరు ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించడానికి ఇష్టపడటం లేదని, దీనివల్ల 4 నుంచి 5 శాతం మంది ప్రయాణాలకు ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారని తెలియజేశారు. 1981 నుంచి ఇప్పటిదాకా రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్‌ను 12 సార్లు మార్చింది. 120 రోజులు, 90 రోజులు, 60 రోజులు, 45 రోజులు, 30 రోజులు.. ఇలా పలుమార్లు ఏఆర్‌పీని మార్చింది. ప్రస్తుతం 60 రోజులకు కుదించిన కారణంగా అక్రమాలు అదుపులోకి వస్తాయని, ప్రయాణికులు చాలా ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదని రైల్వే శాఖ తెలియజేసింది.

క్రైం కార్నర్

భార్య సొంతూరికి రాలేదని ఆత్మహత్య



మధుసూదన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): భార్య సొంతూరుకు రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో జరిగింది. రైల్వే ఉద్యోగి మధుసూదన్(34) రైల్వేక్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఇతను డీఆర్‌ఎం కార్యాలయంలోని కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో ఓఎస్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతని మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందింది. రెండేళ్ల క్రితం బళ్లారికి చెందిన హేమావతిని వివాహం చేసుకున్నాడు. దసరా సందర్భంగా తన సొంతూరు ప్రొద్దుటూరు మండలం లింగాపల్లికి వెళ్లాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో అతను, అతడి కుమార్తె ఊరికి వెళ్లి సోమవారం తిరిగి వచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉండేవాడు. బుధవారం రాత్రి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 9 గంటలైనా భర్త గది తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో భార్య హేమావతి తలుపులు బద్దలు కొట్టించింది. ఉరివేసుకుని ఉండటం చూసి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. ఓ యువతిని కొంత కాలంగా అతడు వేధిస్తున్నాడు. దీంతో ఆ యువతి కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గౌస్‌పీరాను మందలించేందుకు వెళ్లారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. యువతి కుటుంబ సభ్యుడు బ్రహ్మ, మధ్యవర్తిగా వెళ్లిన రాజుపై గౌస్‌పీరా కత్తితో దాడిచేయడంతో వారికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్ గౌస్‌బాషా తెలిపారు.



● ఈ చిత్రంలో కనిపిస్తున్న ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ శింగనమల మండలం కల్లుమడి గ్రామంలోనిది. ఈనెల 9న గ్రామానికి చెందిన నాగార్జున పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగితీగను దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ కనెక్షన్లకు కరెంటు సరఫరా ఆగిపోయింది. రైతులు సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు.

ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు పేట్రేగిపోతున్నారు. వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని, అందులోని ఆయిల్, కాపర్ చోరీ చేస్తున్నారు. గడిచిన పది నెలల్లో వందకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు విద్యుత్ శాఖ అధికారుల సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడంతో రైతులు కరెంటు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)



● యాడికి మండలంలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు పదుల సంఖ్యలో జరిగాయి. ఇటీవల మండలంలోని రాయలచెరువు, చందన గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. వాటిలోని రాగి, అల్యూమినియంను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. మండలంలో ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.



● ఇక్కడ ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్స్ బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలోనిది. ఈనెల 7న రాత్రి గ్రామ శివారులోని పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగను చోరీ చేశారు.

● రాప్తాడు మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన రైతులు ఎర్రిస్వామి, మల్లేష్, రాజు కలిసి 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 6న రాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు.

ఇంకేమీ దొరకవా..?

- పేట్రేగిపోతున్న దొంగలు
- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యం
- ఈఏడాదిలో వందకుపైగా ధ్వంసం
- కాపర్, ఆయిల్ చోరీ
- కరెంటు లేక రైతుల ఇబ్బందులు
- విద్యుత్ శాఖపై అదనపు భారం

కాపర్, ఆయిల్ చోరీ

దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేస్తున్నారు. మార్కెట్‌లో కాపర్ విలువ ఎక్కువగా ఉండటంతో దొంగలు ఈ దారి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అందులోను ఎక్కువగా వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లనే లక్ష్యంగా చేసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో అల్యూమినియం, కాపర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్ కంటే కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ దొరికితే దొంగలకు పండగే. మార్కెట్‌లో కాపర్‌కు ధర ఎక్కువ ఉండటమే కారణం. కాగా వ్యవసాయానికి 25కేవీ, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 నుంచి 35కిలోలు, 16కేవీలో 25నుంచి 30కిలోలా కాపర్ ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో కిలో కాపర్ రూ.1000కిపైగానే పలుకుతోంది. కిలో అల్యూమినియం రూ.350 ఉంటోంది. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని ఆయిల్ లీటర్ రూ.100 వరకు పలుకుతోంది. వీటిని దొంగిలించి గుజిరీ షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖపై భారం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలతో విద్యుత్ శాఖపై అదనపు భారం పడుతోంది. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం జరిగితే..అక్కడ కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అల్యూమినియం 1.40లక్షలు పలుకుతోంది. ఇక కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ 2.15లక్షల వరకు ఉంటోంది. 16కేవీ కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.1.80లక్షలు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈఏడాది అనధికారికంగా వంద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల లెక్క 70లోపు ఉంది. ఈ లెక్కన చూసుకున్నా సగటున ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.1.50లక్షలు అనుకున్నా 1.05కోట్లు విద్యుత్ శాఖపై అదనపు భారం పడింది.

ఎఫ్ఐఆర్ ఉంటేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తేనే విద్యుత్ శాఖ కొత్తవి ఇవ్వడానికి వీలుంటుంది. ఎఫ్ఐఆర్ కాపీ ఆధారంగా విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ వేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్రైం నెంబరు పెరిగితే తమకు ఇబ్బందులు వస్తాయన్న నెపంతో ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఆ తర్వాతే మంజూరు

రైతులు ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు ఎఫ్ఐఆర్ కాపీ తీసుకొచ్చి విద్యుత్ అధికారులకు ఇచ్చిన వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తాం. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్, ఇతరత్ర సామగ్రి కొరత ఉంది. ఈ నేపథ్యంలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా సమస్య తీవ్రత మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఈనెల చివరికి సమస్య సద్దుమణిగే అవకాశం ఉంది.

-సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ముంచిన వాన

- తడిసిన పత్తి.. వేరుశనగ
- రంగు మారితే కొనేవారు ఉండరు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



తొండపాడు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

గుత్తి రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వేరుశనగ, పత్తి రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. మండలంలో పలువురు రైతులు వేరుశనగ పంటను తొలగించారు. కొందరు పొలాల్లోనే కుప్పలుగా వేసుకున్నారు. వర్షానికి తడిచి కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయి. పశువుల మేతగా వాడే వేరుశనగ కట్టె పనికి రాకుండాపోతోంది. రంగు మారిన కాయలను మార్కెట్‌లో కొనేవారు ఉండరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు వేరుశనగ కాయలను పొలాల్లో రాశులు పోశారు. తేమ కారణంగా ఊజి సోకుతోంది. వాటిని ఆరబోసుకునే వీలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు రైతులు పంట దిగుబడిని కాపాడుకునేందుకు వేల రూపాయలు వెచ్చించి టార్పల్‌లు కొని కప్పుకున్నారు. పత్తి పంట ప్రస్తుతం కాయ పగిలే స్థితిలో ఉంది. వర్షానికి నీరు చేరి పత్తి రంగు మారుతోంది. పత్తికాయలు మురిగిపోతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జక్కలచెరువు వద్ద సాగు చేసిన పత్తి పంట



బేతాపల్లి వద్ద తడిసిపోయిన వేరుశనగ

వర్షాలతో నష్టమే..



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు మురిగిపోతాయి. పత్తి రంగు మారుతుంది. మార్కెట్‌లో సరైన ధర పలకదు. నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తి పంట సాగుకు రూ.30 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టుబడి కూడా రాదు. నేను 5 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను.

-సూర్యనారాయణ, బేతాపల్లి

చిన్నపాటి వాన

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. డి.హీరేహాళ్ మండలంలో అత్యధికంగా 28.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో 21.4, కళ్యాణదుర్గం 13.4, గార్లదిన్నె 11.4, కూడేరు 11.2, యల్లనూరు 10.8, ఉరవకొండ 10.4, కణేకల్లు 10.0, రాప్తాడు 9.0, శింగనమల 8.4, రాయదుర్గం 7.8, అనంతపురం 5.4, బుక్కరాయసముద్రం 4.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి చిరుజల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

వేరుశనగ తడిసిపోయింది

నేను నాలుగు ఎకరాల్లో వేరుశనగ, మరో నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. వర్షంతో రెండు పంటలకూ నష్టమే. వేరుశనగ తొలగించి పొలంలోనే కుప్పలు వేశాను. వర్షానికి మొత్తం తడిసిపోయింది. కట్టె కుళ్లిపోతోంది. పశువులకు మేత లేకుండా పోతుంది. కాయలు రంగు మారుతాయి. పత్తి కూడా దెబ్బతింటుంది. ఈ ఏడాది వ్యవసాయం కలిసిరాలేదు. అంతా నష్టమే.



-ప్రసాద్, బేతాపల్లి

జల వనరులకు కళ

చిత్రావతి ఉధృతితో నిలిచిన రాకపోకలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులకు భారీగా నీరు చేరుతోంది. న్యామద్దల, కనుముక్కల చెరువులు నిండి మరువ పారుతున్నాయి. వెల్దుర్తి, చిన్నపరెడ్డిపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ప్రవాహ ఉధృతి తగ్గలేదు.

దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పీఆర్ ఎస్ఈ మురళీ, తహసీల్దారు సురేష్ కుమార్, డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్ చిత్రావతి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. చిత్రావతి ప్రవాహంతో ఏటా చాలా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, పార్టీ నాయకులు పీఆర్ ఎస్ఈ మురళి దృష్టికి తీసుకెళ్లారు. రెండు ప్రాంతాలలో వంతెనల ఎత్తు పెంచాలని కోరారు. ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని ఇంజనీరింగ్ అధికారులు వారికి తెలిపారు. వర్షాల కారణంగా పలు గ్రామాల్లో పాత మిద్దెలు పడిపోయాయి.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రీసత్యసాయి జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌ను కోరారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రవికుమార్, గోపాల్ నాయక్ తదితరులు గురువారం డీడీని కలిశారు. మెచ్యూరిటీ అయిన బాండ్లను సకాలంలో క్లెయిమ్ చేయడం లేదని అన్నారు. ఆరు నెలలుగా వీటిని ఏపీజీఎల్ఐ ఆఫీస్ మేకర్, చెక్కర్, అప్రూవ్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచుతున్నారని అన్నారు. కొత్తగా ఏపీజీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచినా, టీచర్ల కొత్త బాండ్స్ అసంపూర్తిగానే జనరేట్ అవుతున్నాయని అన్నారు. వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసినా.. ఆరు మాసాలుగా విడుదల కావడం లేదని అన్నారు. కొత్తగా జారీ చేసిన బాండ్స్‌లో నామినీ వివరాలను నమోదు చేయడానికి అవకాశం ఇవ్వడం లేదని అన్నారు. బీమా మిస్సింగ్ క్రెడిట్స్ వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

యువకుడి అదృశ్యం



నల్లప్ప

శింగనమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే యవకుడు సోమవారం అదృశ్యమయ్యాడు. ట్రాక్టర్ ఫైనాన్స్ వాయిదా మొత్తాన్ని చెల్లించేందుకు తన మామ రమణతో కలిసి నల్లప్ప సోమవారం అనంతపురం వెళ్లాడు. పని పూర్తి అయిన తరువాత నల్లప్పను రమణ ఆటో ఎక్కించి స్వగ్రామానికి పంపించాడు. కానీ నల్లప్ప గ్రామానికి చేరలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నల్లప్ప తల్లి రామాంజినమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు.

ఆన్‌లైన్‌లో 39.91 లక్షల మోసం



- గ్రామాలకు విస్తరిస్తున్న ఆన్‌లైన్ మోసాలు
- ఈజీ మనీ మోజులో నష్టపోతున్న ప్రజలు
- డబ్బు మీద ఆశతో రూ.40 లక్షల డిపాజిట్

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల ద్వారాపరిచయం అయ్యే అపరిచిత వ్యక్తుల నుండి జాగ్రత్తగా ఉండాలని జిల్లా సైబర్ పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ... ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నా... ప్రజలు మాత్రం అవేమి పట్టించుకోకుండా... డబ్బు ఆశతో లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్న ఘటనలు... నిత్యం వెలుగు చూస్తున్నాయి. అయినా ప్రజల్లో మాత్రం అవగాహన కలగడం లేదని పోలీసు శాఖ అభిప్రాయ పడుతోంది. ఇంతవరకు ఆన్‌లైన్ మోసాలు...నగరాలు, పట్టణాలకే పరిమితం అయ్యేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు గ్రామాలకు కూడా విస్తరించడంలో బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంచుకోవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో బళ్ళారి తాలూకా పరిధిలోని జాలిబెంచి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి షేర్‌మార్కెట్‌లో లభించే లాభాలపై ఆశపడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న ఘటన వెలుగు చూసింది. జాలిబెంచి గ్రామానికి చెందిన ఆ వ్యక్తి ఈ నెల 15వ తేదీన బళ్ళారి నగరంలోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదును పరిశీలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. అతడు ఈ ఏడాది జూన్ 17వ తేదీన మొబైల్‌లో షేర్ మార్కెట్ గురించి వెతుకుతున్న సమయంలో మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీసు గురించిన సమాచారం చూశాడు. అందులో ఉన్న ఫోన్ నెంబరును సంప్రదించి అక్కడి నుంచి వచ్చిన మెసేజ్‌లతో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీసు పోర్ట్‌పోలియో వాట్సప్ గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. ఐపిఓఎస్‌లో డిపాజిట్ చేస్తే 10శాతం లాభాలు వస్తాయని, ఆ గ్రూప్ నుంచి వాట్సప్‌లో మెసేజ్‌లు రావడంతో అందులో డబ్బు డిపాజిట్ చేయడం ప్రారంభించాడు. ఈ ఏడాది జులై 9వ తేదీ నుండి ఆగస్టు 6వ తేదీ వరకు దశల వారీగా రూ 39,91,837లక్షల మొత్తాన్ని తన తల్లి, తన ఖాతాల నుండి జమ చేశాడు. అనంతరం అక్కడి నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో భయపడి... ఆగస్టు 6వ తేదీన ఆన్‌లైన్ కంప్లైంట్ చేశాడు. తిరిగి ఈ నెల 15వ తేదీన బళ్ళారి నగరంలోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు ఎన్.సి.ఆర్.పి నెం 1122/2024గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

సిరుగుప్ప, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి చరిత్ర పూర్వకాలం లాంటిదని తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పరిపాలన, ఎస్టీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. స్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. వేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి తత్వసిద్ధాంతాలను పాటించాలని ఆయన కోరారు. ప్రధాన ఉపన్యాసకుడు కరియప్ప ఆయన జీవితచరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సమాజం విద్యాభివృద్ధి సంఘం అధ్యక్షులు బీఎం సతీష్, ధరప్ప నాయక, ఎంఎస్ సిద్ధప్ప, నరసింహ నాయక, అధికారులు, తాలుకా ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

టీచింగ్ పోస్టుల కోసం నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- పది బృందాల ఏర్పాటు
- అభ్యర్థులకు సమాచారం అందించాం: ఏపీసీ

అనంతపురం విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సమగ్రశిక్ష ప్రాజక్టులో శుక్రవారం నుంచి వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందుకోసం ఎంఈఓ లేదా హెచ్‌ఎంతోపాటు, స్కూల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌ని బృందంగా పెట్టారు. ఇలా 10 బృందాలను ప్రాజక్టు అధికారులు నియమించారు. ఖాళీగా ఉన్న పోస్టులకు 1877 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ప్రాజక్టు అధికారులు తెలిపారు.

వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తప్పనిసరి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ(పీజీ), బీఈడీ, ఎంఈడీ, యూజీడీపీఈడీ, బీపీఈడీ, డిప్లొమో సర్టిఫికెట్లు తేవాల్సి ఉంటుంది. లోకల్ స్టేటస్, కుల, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలి. దివ్యాంగులైతే అందుకు సంబంధించిన సర్టిఫికెట్ తప్పనిసరిగా తేవాలి. గతంలో పనిచేసిన అనుభవం ఉంటే ఎక్స్‌పీరియన్స్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది.

సమాచారం ఇచ్చాం: నాగరాజు, ఏపీసీ

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వెరిఫికేషన్ ఉంటుంది. 1:5 మేరకు అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించాం. సమాచారం అందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుంది.




సమగ్రశిక్ష సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీసీ నాగరాజు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

థామస్ అల్వా ఎడిసన్ (వర్ధంతి)



మానవజాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ వంటి ఉపకరణాలను ఆవిష్కరించిన థామస్ అల్వా ఎడిసన్ అమెరికా దేశం మిలాన్ ప్రాంతంలో 1847 ఫిబ్రవరి 11న జన్మించారు. సాధారణ ఫిలమెంట్ బల్బ్ ఆవిష్కర్తగా పేరొందినా ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్, మాస్ కమ్యూనికేషన్, సౌండ్ రికార్డింగ్‌కు సంబంధించిన ఉపకరణాలు ఫోనోగ్రాఫ్, మోషన్ పిక్చర్ కెమెరా వంటివి ఆవిష్కరించారు. దీంతో పారిశ్రామికరంగ చిత్రమే మారింది. ఆధునిక పరిశోధనా ప్రయోగశాలకు ఆద్యులుగా పేరొందారు. జాన్‌స్కాట్ మెడల్, ఎడ్వర్డ్ లాంగ్‌స్ట్రెంగ్త్ మెడల్, ఫ్రాంక్లిన్ మెడల్ తదితర గౌరవాలు అందుకున్నారు. 1093 వాటికి ఆయన పేరిట పేటెంట్‌లు ఉండడం ఒక రికార్డు. 1931 అక్టోబరు 18న కన్నుమూశారు.

ఓంపురి (జయంతి)



బాలీవుడ్ నటుడు 'పద్మశ్రీ' గ్రహీత ఓంప్రకాశ్ పురి (ఓంపురి) 1950 అక్టోబరు 18న పంజాబ్ రాష్ట్రం అంబాలాలో జన్మించారు. హిందీలో ఆయన నటించిన సినిమాలు జాతీయ స్థాయిలో పేరొందాయి. బుల్లితెరపైనా రాణించారు. హిందీ ప్రధానమైనప్పటికీ బెంగాలీ, కన్నడ, ఇంగ్లిష్, పంజాబీ, గుజరాతీ, తెలుగు, మరాఠీ భాషల సినిమాలలో నటించారు. 2 జాతీయ, 2 ఫిల్మ్‌ఫేర్, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, ఇతర అవార్డులు పొందారు. అత్యధిక చిత్రాలు యుకె, యుఎస్‌లలో చిత్రీకరించడంతో 'ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్'లో గౌరవ అధికారిగా గుర్తింపు పొందారు. 2017 జనవరి 16న కన్నుమూశారు. మరణానంతరం ఆయన గౌరవార్థం అకాడమీ అవార్డును ప్రకటించారు.

బరగూరు రామచంద్రప్ప (పుట్టినరోజు)



ప్రముఖ కన్నడ సినీ దర్శకుడు, ప్రొఫెసర్, స్క్రీన్ రైటర్ బరగూరు రామచంద్రప్ప 1947 అక్టోబరు 18న కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా బరగూరు గ్రామంలో జన్మించారు. 30 ఏళ్లలో పలు డాక్యుమెంటరీ సినిమాలు తీశారు. 1978లో 'ఒందు ఊరిన కథె'కు రాష్ట్ర ఉత్తమ కథారచయిత అవార్డు పొందారు. కేవలం ఒక్క నటితో రూపొందించిన 'శాంతి' సినిమా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. పద్యాలు, చిన్నకథలు, నవలలు రాశారు. కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు, గౌరవ డాక్టరేట్‌లు, పుట్టణ్ణ కణగాళ్, ఇతర గౌరవాలు అందుకున్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ అధ్యయన కేంద్రంలో అధ్యాపకుడిగా, రాష్ట్ర పాఠ్యపుస్తకాల కమిటీ (కేటీబీఎస్)కి అధ్యక్షులుగా వ్యవహరించారు.

మార్టినా నవ్రతిలోవా (పుట్టినరోజు)



అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరొందిన మార్టినా నవ్రతిలోవా 1956 అక్టోబరు 18న చెకోస్లోవిక్‌లో జన్మించారు. వరల్డ్ నెంబరు 1గా సింగిల్స్, డబుల్స్‌లో 200వారాల పాటు నిలిచారు. 18 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్, 31 మేజర్ ఉమెన్స్ డబుల్ టైటిల్స్ (ఆల్‌టైమ్ రికార్డు), వింబుల్డన్‌లో ఉమెన్స్ సింగిల్స్‌లో 9సార్లు విజేత. 1975 నుంచి 2005వరకు టెన్నిస్‌లో ఆమె తన ఆధిపత్యం కొనసాగించారు. అనాథ బాలల సంక్షేమానికి, జంతువుల హక్కులకోసం పాటుపడ్డారు.

అమిష్ త్రిపాఠి (పుట్టినరోజు)



ప్రముఖ కాలమిస్ట్, రచయిత అమిష్ త్రిపాఠి 1974 అక్టోబరు 18న ముంబైలో జన్మించి ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలాలో పెరిగారు. ఆయన రాసిన 8 పుస్తకాలు 2020 నుంచి 5.5మిలియన్ కాపీలు అమ్ముడయ్యాయి. ది 'శివ ట్రిలాజి' పుస్తకం అత్యంత వేగంగా అమ్ముడైంది. లండన్‌లోని నెహ్రూ సెంటర్‌కు దేశం తరపున డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. జార్ఖండ్ రై యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఆయన నవలలు పలు భాషలలోకి అనువాదమయ్యాయి. 21వ శతాబ్దపు ఐకాన్ అవార్డు, లండన్ అలాగే 2022లో లెజెండ్ ఆఫ్ సుహెల్‌దేవ్ పుస్తకానికి గోల్డెన్ బుక్ అవార్డు అందుకున్నారు.

జ్యోతిక (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటి జ్యోతిక 1977 అక్టోబరు 18న ముంబైలో జన్మించారు. ప్రత్యేకించి తమిళ సినీరంగంలో పేరొందినా తెలుగు, కన్నడ, మళయాళ భాషల సినిమాలలో నటించారు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. కలైమామణి, 3 ఫిల్మ్‌ఫేర్, 3 తమిళనాడు రాష్ట్ర సినిమా అవార్డులు, 4 దినకరన్ అవార్డులు పొందారు. భర్త, నటుడు సూర్యతో కలసి అగరం ఫౌండేషన్‌తో గ్రామీణ ప్రాంత పిల్లలకోసం విద్య, సమాజసేవ చేస్తున్నారు.

వాల్మీకి భవనానికి రూ.24లక్షల గ్రాంటు: ఎమ్మెల్యే

దొడ్డబళ్లాపుర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది వాల్మీకి జయంతి నూతన భవనంలో నిర్వహించాలని, వాల్మీకి భవనానికి రూ.24లక్షల గ్రాంటు ఇవ్వనున్నట్టు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు భరోసా ఇచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సాంఘిక సంక్షేమశాఖ, జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన వాల్మీకి జయంతిలో పాల్గొని మాట్లాడారు. వాల్మీకి మహర్షి జీవితంలోని నైతిక విలువలు సమాజానికి మాదిరిగా ఉంటాయన్నారు. వాల్మీకి రామాయణం అన్నివర్గాల ప్రజలకు ఆదర్శగ్రంథమన్నారు. పితృవాక్య పాలకుడైన శ్రీరాముడి జీవనం ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల సాధకులను సత్కరించారు. జిల్లా కాంగ్రెస్ ఎస్టీ విభాగం అధ్యక్షుడు మునికృష్ణప్ప, కేంద్ర సామాజిక న్యాయం, స్వావలంబన సచివాలయ సభ్యుడు ఓబదేనహళ్లి మునియప్ప, వాల్మీకి సముదాయ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కుమార్, సంజీవ్ నాయక్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లకు వాల్మీకి పేరు: సీఎం



మహర్షి వాల్మీకి పురస్కారాలతో ప్రముఖులకు సన్మానం



విధానసౌధ వద్ద కళాకారుల సందడి

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయచూరు విశ్వవిద్యాలయంతోపాటు రాష్ట్రంలోని అన్ని షెడ్యూల్డ్ ట్రైబ్స్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మహర్షి వాల్మీకి పేరు పెడతామని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. గురువారం మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని విధానసౌధ ప్రాంగణంలోని వాల్మీకి విగ్రహానికి ఆయన పూలు చల్లి పూజలు చేశారు. వాల్మీకి సామాజికవర్గం రాజనహళ్ళి మఠాధిపతి ప్రసన్నానందపురి స్వామీజీ, మంత్రులు రాజణ్ణ, సతీశ్‌జార్కిహొళి, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బసనగౌడ దద్దల్, ప్రకాశ్ హుక్కేరితోపాటు వాల్మీకి సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విధానసౌధ బాంక్వెట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల సాధకులు ఐదుగురికి మహర్షి వాల్మీకి పురస్కారాలను ప్రదానం చేశారు. బెంగళూరు విభాగం నుంచి కిలారి జోగయ్య, మైసూరు డాక్టర్ రత్నమ్మ ఎస్, బెళగావి రాజశేఖర తల్వార, బెంగళూరు సెంట్రల్ కేఎస్ మృత్యుంజయ, కలబురగి నుంచి రత్నమ్మ బి సోగిలను సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాకుంతల నాటకాన్ని కురుబ సమాజానికి చెందిన కాళిదాస్ రచించారని, మహాభారతాన్ని బెస్త సామాజికవర్గానికి చెందిన వ్యాసుడు రచించారని, రామాయణాన్ని మహర్షి వాల్మీకి రచించారన్నారు. అడవుల్లో అనాగరికంగా జీవిస్తున్న వాల్మీకి సంస్కృతాన్ని నేర్చుకుని కావ్యాన్ని రచించారని, అటువంటి మహనీయుడిపై కట్టుకథలు సృష్టిస్తారని మండిపడ్డారు. శూద్రులు, అట్టడుగువర్గాలు సంస్కృతం నేర్చుకోవడం నిషిద్ధంగా ఉండేదన్నారు. అటువంటి కాలంలోనే సంస్కృతాన్ని నేర్చుకుని శ్లోకాల ద్వారా ప్రపంచాన్ని మెచ్చే రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి గురించి చర్చించుకోవడం గర్వంగా భావించాలన్నారు. రామాయణంలో రామరాజ్యం అంటే సమానత్వం, సహభాగత్వం అని అర్థమన్నారు. శ్రీరాముడి కుమారులు లవకుశలకు ఆశ్రయంతోపాటు శిక్షణ నేర్పింది వాల్మీకి మహర్షి అన్నారు. వాల్మీకి విశ్వమానవుడు అనేందుకు ఇదో ఉదాహరణ అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వ మేనన్నారు. ప్రతి హోబళికి ఓ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలనేది తమ ఆశయమన్నారు. కేవలం మాటలతో సమానత్వం సాధ్యం కాదని, ఆచరణ ముఖ్యమన్నారు. ఆర్థిక, సామాజిక అసమానత తొలగితేనే సమానత్వం సాధ్యమని బాబా సాహెబ్ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారన్నారు. మా ప్రభుత్వం కులమతాలతో సంబంధం లేకుండా పేదలకు ఆర్థికశక్తినిచ్చేందుకే గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తన వ్యాఖ్యలన్నీ ప్రజలు నమ్మరాదని, పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. నిజాలను నిర్భయంగా మాట్లాడేలా దళిత, బీసీ, మైనారిటీ వర్గాలు ఎదగాలన్నారు. కల్యాణ కర్ణాటక బోర్డ్ ఛైర్మన్ అజయ్‌సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా కావేరి తీర్థోద్భవ



కొనసాగుతున్న పూజలు



తీర్థోద్భవ ప్రత్యేక పూజల్లో భక్తుల సందడి

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది కన్నడిగుల జీవనాడి కావేరి నది ఉద్భవించే స్థలంలో ఏటా సంప్రదాయబద్ధంగా జరిపే తలకావేరి ఉత్సవాలు ఘనంగా జరిపారు. కొడగు జిల్లా తలకావేరిలో గురువారం తీర్థోద్భవం జరిగింది. తుల సంక్రమణలో తీర్థోద్భవాన్ని తిలకించేందుకు కొడగు, మైసూరు, మండ్యతోపాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొడగు జిల్లా వాసులు బుధవారం రాత్రికే పెద్ద ఎత్తున చేరుకున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు ఆరంభమయ్యాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బోసరాజు, ఎమ్మెల్యేలు పొన్నణ్ణ, వంతర గౌడ, సుజా కుశాలప్ప, గ్యారెంటీ పథకాల అమలు కమిటీ ఛైర్మన్ ధర్మజా ఉత్తప్ప, జిల్లా అధికారి వెంకటరాజా, ఎస్పీ రామరాజన్ పాల్గొన్నారు. కొడగు సంప్రదాయ దుస్తులలో భక్తులు ప్రత్యేకం అనిపించారు. మంత్రి బోసరాజు మాట్లాడుతూ ఈ ఏడాది కావేరి తీరంలో సంతృప్తికరంగా వర్షాలు కురిశాయన్నారు. కావేరికి అనుబంధమైన నాలుగు జలాశయాలు నిండుకుండలా ఉన్నాయన్నారు. దీంతో చెరువులు, కాలువలకు నీరు మళ్లిస్తున్నామన్నారు. కావేరి ఆయకట్టు రైతులలో సంతోషం నెలకొందన్నారు. గత ఏడాది వర్షాభావంతో కేఆర్ఎస్‌కు నీరు చేరలేదన్నారు. కానీ ఈ ఏడాది కేఆర్ఎస్ మూడోసారి పూర్తిగా నిండిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కొనసాగుతుండడంతో ఇన్‌ఫ్లో 8547 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 8287గా ఉందన్నారు.

మహిళల ఆశీస్సులతో మరోసారి మాదే అధికారం

▸▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆశీస్సులతో మరోసారి మాదే అధికారమని సీఎం సిద్దరామయ్య ధీమా వ్యక్తం చేశారు. గురువారం కేపీసీసీలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళలకు ఆర్థికశక్తి కల్పించడంతో పాటు సామాజిక న్యాయం, రక్షణకు కట్టుబడ్డామన్నారు. మహిళల్లో మరింతశక్తి నింపేందుకు సౌమ్యారెడ్డి పనిచేస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ వారు మహిళా స్వాతంత్ర్యానికి వ్యతిరేకమన్నారు. గృహలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాలు ప్రతి మహిళకు అండగా ఉన్నాయన్నారు. బీజేపీ వారు అన్నభాగ్యను వ్యతిరేకిస్తారని మండిపడ్డారు. గృహలక్ష్మి సొమ్ముతో అత్తాకోడళ్లు సంతృప్తిగా ఉన్నారని, బీజేపీ వారికే బాధ ఉందన్నారు. సౌమ్యారెడ్డి మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నాకు మరింత బాధ్యత పెంచిందన్నారు. పార్టీలో మహిళా కార్యకర్తలను పెంచడంతోపాటు రాష్ట్రంలోని ప్రతి మహిళకు అండగా నిలుస్తామన్నారు. జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా, కేపీసీసీ అధ్యక్షులు, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు కృష్ణబైరేగౌడ, లక్ష్మిహెబ్బాళ్కర్, మాజీ మహిళా అధ్యక్షురాలు పుష్పా అమరనాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఎం, డీసీఎం నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న సౌమ్యారెడ్డి తదితరులు

సంస్కృతిని ప్రతిబింబించే మహాకావ్యం రామాయణం



వాల్మీకి జయంతిలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామాయణం భారతీయులు జీవన చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించే మహాకావ్యమని, మహర్షి వాల్మీకి రచించకుంటే ఇప్పుడు ఎవరికీ తెలిసేది కాదని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ, జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన వాల్మీకి జయంతిలో పాల్గొని మాట్లాడారు. హిందువులకు రామాయణ, మహాభారత, భగవద్గీతలు పవిత్రమైన గ్రంథాలన్నారు. వీటన్నింటిలో రామాయణం పురాతనమైన దన్నారు. ఈ కారణంగానే వాల్మీకి మహర్షిని ఆదికవిగా పిలుస్తారన్నారు. రామాయణం ద్వారా పితృవాక్య పరిపాలన, సోదర బాంధవ్యం అంశాలు, ఇతర సిద్ధాంతాలను ప్రజలు అలవరుచుకోవాలన్నారు. తద్వారా మహనీయుల జయంతి ఆచరణకు అర్థం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, సభ్యులు పర్ణా సుహేల్, గంగమ్మ, రత్నమ్మ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, తహసీల్దార్ వెంకటేశప్ప, ఈఓ రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అంజలిదేవి, బీఈఓ గురుమూర్తి, ఇన్‌స్పెక్టర్ నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సాహిత్యానికి వాల్మీకి సేవలు అనన్యం

బాగేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా భారతీయ సాహిత్యరంగానికి వాల్మీకి మహర్షి సేవలు అనన్యమని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి రామసుబ్బమ్మ అభిప్రాయపడ్డారు. బాగేపల్లి హోబళిలోని ఘంటంవారిపల్లిలో ప్రభుత్వ హైస్కూల్‌లో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని వాల్మీకిచిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆదికవి మహర్షి వాల్మీకిని స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఆదర్శ విలువలను యువతకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. రామాయణ మహాకావ్యంలో మానవత్వం, భాతృత్వం, కరుణ, త్యాగం, ధర్మరక్షణ, రాజనీతి తదితర వాటిని మానవజాతికి తెలియచేశారన్నారు. స్కూల్ అసిస్టెంట్ కేబీ ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ బతుకులో పరివర్తన సాధించిన మహనీయుడు వాల్మీకి గొప్పవారన్నారు. రామాయణ గ్రంథాన్ని రచించి మానవాళికి గొప్ప గ్రంథాన్ని అందించారన్నారు. టీచర్ చంద్రశేఖర్, నారాయణస్వామి సిబ్బంది రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో...

శిడ్లఘట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి మహర్షిజయంతి అర్థవంతంగా ఆచరించారు. వాల్మీకి సముదాయ ప్రముఖుడు ఎంఎన్ మూర్తి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ మాట్లాడుతూ ప్రపంచానికి మహర్షి వాల్మీకి గొప్ప సందేశాన్ని ఇచ్చార న్నారు. రామాయణ మహాకావ్యం రచించిన మహనీయుడు దేశంలో జన్మించడం గర్వకారణమన్నారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఆర్‌వి ఉమేశ్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి వంటి మహనీయుల జయం తి అర్థ వంతంగా ఆచరించడం సంతోషంగా ఉందన్నారు. పీడీఓ శారద, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు శివానంద, సభ్యుడు ఎంకే రవిప్రసాద్, దేవరాజ్, గోపాల్‌రెడ్డి, కే తిరుమలేశ్, హరీశ్‌కుమార్, వాల్మీకి సముదాయ ప్రముఖుడు మంజునాథ్, టైలర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా పలు చోట్ల వాల్మీకి జయంతా కార్య క్రమాలు అర్థవంతంగా జరిగాయి.



ఘంటంవారిపల్లిలో వాల్మీకి జయంతి



మేలూరులో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు

వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలను వెంటనే పాటించాలని మాదిగ దండోరా రిజర్వేషన్ పోరాట, జనజాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం సిద్దరామయ్యకు రిజర్వేషన్ వర్గీకరణపై ప్రత్యేకమైన లేఖను పంపారు. ఆగస్టు 1న అపెక్స్ తీర్పు ఆదేశాలకు అనుగుణంగా అంతర్గత రిజర్వేషన్‌లు అమలు చేస్తామని 2023 ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలో ప్రకటించిందన్నారు. వర్గీకరణ జాప్యంతో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ద్వారా ఎంతోమందికి అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ జరిగేదాకా నియామ కాలను రద్దు చేయాలన్నారు. కులగణన అంశాన్ని తీసుకొచ్చి సుప్రీం కోర్టు తీర్పుపై గందరగోళం సృష్టించేలాంటి చర్యలు సరికాదని డిమాండ్ చేశారు. వర్గీకరణ జాప్యం చేస్తే తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రాఘవేంద్రస్వామి మఠంలో విశేష పూజలు



గురురాఘవేంద్రస్వామికి అలంకరణ

శిడ్లఘట్ట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం విశేషపూజలు నిర్వహించారు. ఆశ్వయుజ పూర్ణమి, గురువారం రావడంతో వేకువజామునుంచి పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయశుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కాగా వేణుగోపాలస్వామి ఆలయంలోని షిర్డీసాయిబాబాకు, మళూరు శివారులోని షిర్డీసాయిబాబా మందిరంలోనూ పూజలు కొనసాగాయి. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

గ్లోబల్ నర్సింగ్ అవార్డుకు కసరత్తు

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డును డిసెంబరులో బెంగళూరులో నిర్వహించదలిచినట్టు ఏస్టర్ డిఎం హెల్త్‌కేర్ ఛైర్మన్ ఆజాద్ మూపెన్ ప్రకటించారు. ఈమేరకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోగులు, సమాజశ్రేయస్సు కోసం బాధ్యతాయుతంగా పనిచేసే వారికి ఏస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ పేరిట అవార్డు ఇస్తున్నామన్నారు. నర్సింగ్ రంగంలో ఆదర్శమైన వారిని ఎంపిక చేయడమే లక్ష్యమన్నారు. ఏడు దేశాలలో ఏస్టర్ హెల్త్‌కేర్‌లో 9వేలమంది నర్సులు పనిచేస్తున్నారన్నారు. మూడో ఎడిషన్ విజేతలకు రూ.2 కోట్లతో పాటు మరో 9మందికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. డిసెంబరులో బెంగళూరులో విజేతలను ప్రకటించి ఇక్కడే సత్కరించదలిచామన్నారు. ఇందుకోసం పలు దేశాలలో సర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

బైక్, బొలెరో ఢీ - మహిళ మృతి




తరన్నుం (ఫైల్)

చింతామణి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చింతామణి - మదనపల్లి రాష్ట్ర రహదారిపై దండుపాళ్య సమీపాన బొలెరో, బైక్ ఢీ కొన్న ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న ఒక మహిళ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. బైక్‌పై మురగమల్లా గ్రామానికి చెందిన తరన్నుం (22) ఘటనా స్థలంలో మృతి చెందగా ఆమె భర్త 33ఏళ్ల ఆయాజ్ గాయపడి చింతామణి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. కాగా బొలెరోలో కదిరి పట్టణానికి చెందిన వారు స్వల్ప గాయాలతో చింతామణి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కదిరి నుంచి మదనపల్లి - చింతామణి మార్గంలో బెంగళూరు గ్రామీణ జిల్లా విజయపుర వైపు వెళ్తోంది. కెంచార్లహళ్ళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల వెల్లువ

బంగారపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులసంఘం 2024-29కు తాలూకా శాఖ డైరెక్టర్, పదాధికారుల ఎన్నికలకు గురువారం ప్రాథమిక విద్యాశాఖ నుంచి విజి కుమార్, సయ్యద్ ముక్తియార్ అహ్మద్, కెజి మంజునాథ్, సతీశ్ కుమార్, ప్రశాంత్ కుమార్‌లు నామినేషన్‌లు సమర్పించారు. ఎన్‌పిఎస్ ఉపాధ్యాయుల సంఘానికి చెందిన ఐదుగురు నామినేషన్ సమర్పించినట్టు ఎన్నికల అధికారి మంజునాథచారి తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి విజికుమార్ మాట్లాడుతూ 2024-29 అవధికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో ఈసారి పోటీ చేస్తున్నానన్నారు. తమ ఉద్దేశ్యం ఎన్‌పిఎస్ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయడమేనన్నారు. వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామన్నారు. ఒక్కరోజే ఉండడంతో గురువారం నామినేషన్లు వెల్లువెత్తాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.93	1,613.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	28,607	652
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,487	10,466
సామర్థ్యం (టీఎంసీలు)	101.50	44.69

జెన్నీమిల్క్ కేసులో మరో ఇద్దరి అరెస్టు



ఎస్పీ శ్రీహరిబాబు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జెన్నీ మిల్క్ పేరుతో రైతులను మోసం చేసిన కేసుకు సంబంధించి మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్ర దేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్.హర్షవర్దన్ రాజు, రాయచోటికి చెందిన గుర్రం యోగానంద రెడ్డిలను తుమకూరు జిల్లా పరిధిలోని పావగడ ప్రాంతంలో బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. జెన్నీ మిల్క్ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసి వారికి చెందిన 33 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఎంత మొత్తంలో గోల్‌మాల్ జరిగిందనే దానిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కేసులో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ కేసును సిఐడి స్థాయిలో దర్యాప్తు చేయాలని కోరామని, ఇందుకు సంబంధించి ఆదేశాలు త్వరలో రానున్నట్లు ఎస్పీ వివరించారు. అడిషనల్ ఎస్పీ సలీం పాషా, డివైఎస్పీ టి.మంజునాథ్ ఆధ్వర్యంలో నిందితుల అరెస్టు జరిగినట్లు తెలిపారు.

కన్నడ రాజ్యోత్సవానికి భారీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఏడీసీ మహ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమాన్ని సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఏడీసీ మహ్మద్ జుబేర్ సూచించారు. కన్నడ రాజ్యోత్సవ వేడుకల ఏర్పాట్ల కోసం అనంతపురం రోడ్డులోని జిల్లాపాలనా భవనంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నవంబరు 1న నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం ఆవరణలో కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. దేవాదాయశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ భువనేశ్వరీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జెండాను ఎగురవేసి సందేశం ఇస్తారన్నారు. బళ్లారిలో ఈసారి కన్నడ రాజ్యోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగంతో పాటు కన్నడ సంస్థలన్నీ చేతులు కలపాలన్నారు. తొలిసారిగా కన్నడ నాడు-నుడి లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు అవార్డులు అందజేస్తామన్నారు. ఇందుకోసం అసిస్టెంట్ కమిషనర్ అధ్యక్షతన ఎంపిక కమీటీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. 19, 20 తేదీల్లో కన్నడ జ్యోతి రథం జిల్లాకు వస్తుందని స్వాగతం పలికి వీడ్కోలు పలకాలని ఏడీసీ కోరారు. సమావేశంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజుతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి చూపండి.. ప్లీజ్!

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలానికి దారిలేక తుంగభద్ర నదీ తీరంలో మృతుల శరీరాలను పాతిపెట్టాల్సిన పరిస్థితి నెలకొందని నవలి గ్రామస్తులు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విజయనగర జిల్లా హవినహడగలి తాలూకా నవలి గ్రామంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అక్రంషా దృష్టికి నవలి గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ విషయాన్ని తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన టి.లక్ష్మమ్మ జడ్పీ సిఇఓకు ఇచ్చిన వినతి పత్రంలో శ్మశానానికి ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కేటాయించిందని, ఆ శ్మశానానికి దారిలేకపోవడంతో విధిలేని పరిస్థితిల్లో తుంగభద్ర నదీ తీరంలోనే మృతదేహాలను దహనం చేయాల్సివస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, స్థానిక తాహసీల్దారు వద్దకు సమస్య తీసుకెళ్ళినా ఇంతవరకు పరిష్కారం లభించలేదని తెలిపింది. స్థానిక రైతులతో చర్చించి నవలి గ్రామ శ్మశానానికి వెళ్ళేందుకు దారి ఏర్పాటు చేయాలని మనవి పత్రంలో జడ్పీ సిఇఓను వేడుకుంది.

అందరికీ ఆదర్శం వాల్మీకి చరితం

ఘనంగా జయంతి



వాల్మీకి భవన్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ శోభారాణి, డీసీ తదితరులు



వాల్మీకి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, చెక్కులు అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర



ఎస్పీ సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న రూరల్, సిటీ ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి



గంగావతి పట్టణంలోని ప్రతిభావంత విద్యార్థులు, సమాజ సేవలకులను సన్మానిస్తున్న హెచ్ఆర్ శ్రీనాథ్



సండూరులో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



కురుగోడులో రామలక్ష్మణ, వాల్మీకి వేషభూషణాలతో ఆకట్టుకున్న చిన్నారులు



రాయచూరులో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వాల్మీకి అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి ఎంపీ వివరించి, అనంతరం విశిష్టసేవలందించిన సమాజ ప్రముఖులను ఘనంగా సన్మానించారు.



రాయచూరులో వివిధ వేషభూషణాలతో కళాబృందాల ప్రదర్శన

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్ సేవలు

● డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి బళ్లారి మెడికల్ అండ్ రీసెర్చ్ కాలేజ్(బిమ్స్), బళ్లారి జిల్లా ఆసుపత్రి, సండూర్, సిరుగుప్ప ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డయాలసిస్ సెంటర్లలో ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. ప్రధానమంత్రి డయాలసిస్ సేవల కార్యక్రమం కింద ఈ సేవలను అందించడంపై బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు, వైద్యులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళి డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ప్రజలకు నమ్మకం కలిగించాలని వైద్యాధికారులకు సూచించారు. బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాలకు కేంద్రం. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బిమ్స్‌లో 13, జిల్లాఆసుపత్రిలో 08, సండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 2, సిరుగుప్ప ప్రభుత్వాసుత్రిలో రెండు డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డయాలసిస్ సెంటర్‌లలో ప్రజలకు సేవలందించేందుకు ఉపయోగించే డయాలైజర్ బ్లడ్ ట్యూబ్‌లను అదేవ్యక్తి కనీసం 5ఉండి 6సార్లు వాడిన తర్వాత సురక్షితంగా తొలగించవచ్చన్నారు. బళ్లారి నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా డయాలసిస్ సేవలు అందించేందుకు చర్చిస్తున్నట్లు తెలిపారు. అక్కడ కూడా ఉచిత సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య ఆరోగ్య శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈసందర్భంగా బిమ్స్ డైరెక్టర్ టి.గంగాధరగౌడ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ డా.బసారెడ్డి, డా.మరియంబి, డా.చిదంబరమూర్తి, వీరేంద్రకుమార్, రాఘవేంద్ర,రామకృష్ణ, రోహన్, డా.రాఘవేంద్ర, రామకృష్ణ, డా. శ్రీనివాస్, డా.జలీనా తాజ్, డా.మయూరి పాల్గొన్నారు.

బీజేపీపై అసత్య ఆరోపణలా?

- మాజీ మంత్రి నాగేంద్రపై గాలి జనార్ధనరెడ్డి నిప్పులు



సమావేశంలో మాట్లాడుతున్న గాలి జనార్ధనరెడ్డి

బళ్లారి సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) :బీజేపీపై అసత్యఆరోపణలు చేయడం సరికాదని హీరోయిజం చూపించవద్దని ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డి మాజీ మంత్రి నాగేంద్రకు సూచించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనతో సహా గత యూపీఏ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలుగా ఉన్న అనిల్ లాడ్, ఆనంద్‌సింగ్, సురేశ్‌బాబు, నాగేంద్ర సతీశ్ శైల్ తదితరులు సీబీఐ అరెస్టు చేయడం కారణంగా జైలులో ఉన్న సంగతి మర్చిపోవద్దన్నారు. మళ్ళీ మంత్రి కావాలనుకునే నేపథ్యంలో బీజేపీపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. వాల్మీకి కార్పోరేషన్ కుంభకోణలో విమాన టిక్కెట్లు, ఇంటి ఖర్చుల కోసం కార్పోరేషన్ డబ్బును వినియోగించినట్లు ఈడీ సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు ముగ్గురు ఎమ్మెల్యేలు భరత్‌రెడ్డి, గణేశ్, కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాసులు రూ 1480కోట్లు కేటాయించారని, కార్యకర్తలకు ఒక్కొక్కరికి పదివేలు అందజేశారని, ఇదంతా ఈడీ రికార్డుల నుంచి తెలిసిందన్నారు. ఎన్నికల కోసం మొత్తం రూ. 20కోట్లు వినియోగించారన్నారు.

వాల్మీకి, వక్ఫ్‌సిద్దార్థట్రస్ట్, ముడాతోపాటు గత 15నెలల్లో కాంగ్రెస్ అనేక కుంభకోణాల్లో కూరుకుపోయిందన్నారు. ఇది బ్యాంకు స్కాం అని చెప్పడానికి సిగ్గుపడాలన్నారు.

సండూరు గెలుపే లక్ష్యం

ఈసారి సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటామన్నారు. అందుకు సండూరులో ఇంటింటికి వెళతామన్నారు. ఆదివారం నుంచి ప్రతి గ్రామానికి వెళ్లి, ప్రచారం చేస్తానన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, పంచాయతీ మాజీ సభ్యుడు గోనాల్‌రాజ శేఖర్‌గౌడ్, హెచ్ హనుమంతప్ప, డా. టీకే సుందర్ పాల్గొన్నారు.

శబ్దం చేస్తేనే చేతికి పంట



పక్షుల నుంచి పంటను కాపాడుకునేందుకు మైక్‌తో తంటాలు

కంప్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్‌లో చేతికొచ్చిన మొక్కజొన్న పంటను రక్షించుకునేందుకు కంప్లి పట్టణం వ్యవసాయ కృషిపత్తిన శిక్షణ కేంద్రం వద్ద వుండే రైతు నాగరాజు ఎలక్ట్రానిక్ మైకులను అమర్చి శబ్దం చేస్తూ పక్షుల బెడద నుంచి కాపాడుకుంటున్నారు. ఈ సందర్భంగా రైతు నాగరాజు మాట్లాడుతూ తాము జాగ్రత్త వహించకపోతే చేతికొచ్చిన పంట ఈ పక్షుల వల్ల పూర్తిగా నష్టపోయే ప్రమాదం వుందని, సాయంత్రం, ఉదయం వేళల్లో ఇలా శబ్దాలు చేపట్టి పంటపై పక్షుల వాలకుండా చేసి పంటను రక్షించుకుంటామని తెలిపారు.

పెట్రోల్ బంక్ కోసం చెట్ల నరికివేత

యజమానిపై కేసు నమోదు



మోడుగా మారిన చెట్లు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బళ్ళారి నుంచి మోకా గ్రామానికి వెళ్ళే దారిలో పెట్రోల్ బంకు ప్రజలకు కనిపించడం లేదంటూ రోడ్డు ప్రక్కన ఉన్న 8 చెట్లు కొమ్మలను నరికి వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బళ్లారి నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు ఉన్న 132 రాష్ట్ర రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన 'షా ఫిల్లింగ్ స్టేషన్ వాహన దారులకు కనిపించలేదంటూ.. రోడ్డుకు ప్రక్కన ఉన్న 8 పెద్ద చెట్ల కొమ్మలను పెట్రోల్ బంకు యజమాని నరికి వేయించాడు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్లు నరకడానికి ఉపయోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకోవంతోపాటు షా పెట్రోల్ బంకు యజమానిపై కేసు నమోదు చేశారు.

హోసూరు జోన్

వైద్య బీమా పథకాల కార్డుల పంపిణీ



సంక్షేమ పథకాలు అందజేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం కింద లబ్ధిదారులకు రూ.5లక్షలవరకు ఉచిత వైద్యం లభిస్తుందని, ఈ పథకంలో 1513 వైద్య శస్త్ర చికిత్సలు, 52 రోగనిర్ధారణ పరీక్షలు, 11 సంబంధిత తదుపరి చికిత్సలు, 8 ఆధునాతన శస్త్రచికిత్సల సదుపాయాలు ఉన్నాయని కలెక్టర్ సరయు తెలిపారు. ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన క్రింద కృష్ణగిరి జిల్లాలో 7 ప్రభుత్వ ఆసుపత్రులు, 27 ప్రైవేట్ ఆసుపత్రులలో అమలవుతోందన్నారు. తాజాగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో కొంతమందికి ఆరోగ్యబీమా కార్డులను కలెక్టర్ సరయు అందజేశారు. ఇంతవరకు ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం క్రింద కృష్ణగిరి జిల్లాలో మొత్తం 4,45,021 బీమా కార్డులు మంజూరైనట్లు తెలిపారు. వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. 4 ఆసుపత్రులలో డెంకణీకోట, ఊత్తంగరై, ప్రభుత్వ ఆసుపత్రులు, హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల అండ్ రీసెర్చ్ హాస్పిటల్, చంద్రశేఖర హాస్పిటల్ అత్యుత్తమ వైద్యం అందించినట్లు గుర్తింపు పొందాయన్నారు. ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్ దర్మర్, జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేశ్ వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

అన్నా డీఎంకే వార్షికోత్సవం

హోసూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవంలో భాగంగా హోసూరు రాయకోట రోడ్డు జంక్షన్‌లోని ఎంజీఆర్ విగ్రహానికి కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి హోసూరు తూర్పు మండల కార్యదర్శి రాజు అధ్యక్షత వహించగా మాజీ మంత్రి, కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హోసూరు యూనియన్ బాగలూరులో యూనియన్ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంల్లో జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రజలకు అన్నదానం నిర్వహించి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోసూరు కార్పరేషన్ మండల కమిటీ అధ్యక్షుడు జయప్రకాశ్, హోసూరు కార్పొరేషన్ ప్రతిపక్షనేత నారాయణన్, హోసూరు కార్పొరేషన్ విద్యా కమిటీ చైర్మెన్ శ్రీదరన్, హోసూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశివెంకట్ స్వామి, కౌన్సిల్ సభ్యురాలు శిల్పా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్‌డ్రిల్

హోసూరు అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రైవేట్ పాఠశాలల్లో వర్షాకాలం, దీపావళి పండుగ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనతోపాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వర్షాల వేళ పాటించాల్సిన జాగ్రత్తలు, దీపావళి వేళ ఎలాంటి ముందస్తు చర్యలు పాటించాలో వివరించారు. ప్రత్యేకించి బాణాసంచా దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ విద్యార్థులకు పలు సలహా సూచనలు చేశారు. వరదలు వస్తే ఎలా అధిగమించాలో, ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల భారీగా పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వైభవంగా మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం ఊరేగింపులో డీసీ, ఎంపీ, ఎమ్మెల్యే

రాయచూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేఈబీ పాఠశాల వద్ద ఉన్న వాల్మీకి సర్కిల్లో ఎంపీజి కుమార్ నాయక్, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ, ఉపాధ్యక్షుడు సాజిద్ సమీర్, డీసీ నితీశ్, జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వె, ఏఎస్పీ డా.శివకుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీశైల సి కాచాపుర, నగరసభ కమిసనర్ గురుసిద్ధయ్య స్వామి, డీహెచ్ఓ డా.సురేంద్ర బాబు తదితరులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం, నగరసభ, జడ్పీ, తదితర శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కన్నడజ్యోతి రథయాత్రకు ఘనంగా వీడ్కోలు

రాయచూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కన్నడ సాహిత్య పరిషత్ 40వ సమ్మేళనాలను పురస్కరించుకుని చేపట్టిన కన్నడ జ్యోతి రథయాత్రకు గురువారం జిల్లా నుంచి ఘన వీడ్కోలు పలికారు. జిల్లా పాలన యంత్రాంగంతో పాటు సాహిత్య పరిషత్ ప్రతినిధులు, కన్నడ భాషాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నడ రథానికి అపూర్వమైన వీడ్కోలు పలికారు. స్థానిక రంగమందిరం నుంచి బయలుదేరిన కన్నడ రథను అంబేడ్కర్, సర్కిల్, బసవేశ్వర సర్కిల్ మీదుగా యాదగిరి జిల్లాకు బయలుదేరి వెళ్లింది. కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో కన్నడ జ్యోతి యాత్ర నిర్వహిస్తున్న సందర్భంగా యాత్రలో పాల్గొన్న పలువురు ప్రముఖులు కన్నడిగుల మధ్య ఐక్యతను, సౌహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడమే కన్నడ జ్యోతి యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు.



యాత్రకు వీడ్కోలు పలుకుతున్న ఎంపీ